శ్రీ చంద్రఫామ్స్ & రిసార్ట్స్ ఇండియా లిమిటెడ్ – నవ్య వీక్లి కథల పోటీలో

విశేష బహుమతి రూ. 2,000 పొందిన కథ

**డిసెంబర్ 01**

అన్ని విషయాలూ డైరీలో రాయకూడదని తెలుసు.
ఈ డైరీ ఇంకెవరైనా చదివే ప్రమాదం వుందనీ తెలుసు. అయినా ఎవరితోనైనా పంచుకోగలిగిన సంగతైతే..... డైరీలో రాయకపోదును. గుండె లోతుల్లోంచి దుఃఖం తన్నుకొస్తోంది. ఒళ్ళంతా చీదరగా వుంది. నాపైన నాకే అసహ్యం వేస్తోంది. డైరీ రాస్తుంటే చేతులు సన్నగా వణుకుతున్నాయి. కాళ్ళల్లో సాయంత్రం మొదలైన వణుకు ఇంకా తగ్గలేదు.
ఇప్పుడు దాదాపు అర్ధరాత్రి కావస్తోంది. జీరో వాల్ట్స్ బల్బు వెలుతురులో... నేను ఒక్క దాన్ని హాస్టలు గదిలో మేల్కొని ఇలా... నా లోపలి దుఃఖానికి, వేదనకు అక్షర రూపం ఇస్తున్నాను.

# ప్రార్థన

పలమనేరు బాలాజీ

ఇనుప మంచంలో పై అరలో నేను, క్రింద వరుసలో ఉమ ఇంకా క్రింద వరుసలో జ్యోత్స్న. మంచం పైనే ఈ సమయంలో కూర్చుని డైరీ రాసుకోవటం అస్సలు కుదరదు కాక కుదరదు. కాబట్టే మంచం పైన పడుకుని గోడవైపుకు తిరిగి, పక్కనే డైరీ పెట్టుకుని రాస్తున్నాను. ప్రశాంతంగా డైరీ రాసుకోలేను. అన్నీ చెప్పలేనట్లే రాయలేనివి ఎన్నో, ఎంత ఆపుకుందామనుకున్నా కన్నీళ్లు ఆగడమే లేదు. గొంతు తడారి పోతూ వుంది. గుండెలో, కళ్ళలో, గొంతులో ఏమిటో వెగటుగా, మంటగా వుంటోంది.

పొత్తి కడుపులోంచి ఏదో బాధ మొదలై శరీరమంతటా వ్యాపిస్తోంది.

దేవుడా? ఏమిటి నాకీ శిక్ష? నేనేం పాపం చేసానయ్యా?

అమ్మ, నాన్న, త ్ముడు ఉన్నట్లుండి గుర్తుకొచ్చేసారు. ఇల్లు గుర్తొచ ంది. ఊరు గుర్తొచ్చింది.

అమ్మమ్మ, నానమ్మ గుర్తుకొచ్చారు.

అందరి మొహాలు కళ్ళముందు కదలాడుతూ వుంటే ఇక నా వల్ల కావడం లేదు. కళ్ళ నిండా నీళ్ళు!

అదిమి పట్టుకున్న దుఃఖం ఒక్కసారిగా తన్నుకుని బయటకొచ్చేసింది.

అమ్మా.... నాన్నా....

ఎందుకు నన్నీ నరకంలో తెచ్చి పడేసారు? నేనే తప్పు చేసానని నాకింత శిక్ష విధించారు?

ఎన్నాళ్ళు.... నాకీ నరకయాతన?

నాన్నా... ఇక్కడ నాకు ఎన్నిబాధలు, భయాలు, అవమానాలు వున్నాయో నీకు తెలుసా?

అమ్మా .... నీతో ఏదైనా మాట్లాడాలి అంటేనే భయమేస్తుందే, నన్నేం మాట్లాడనివ్వవు.

'ఏరా బావున్నావారా' అని నువ్వడిగి చాలా రోజులవుతోందమ్మా? ఎప్పుడు నువ్వొచ్చినా, ఫోన్‌లో మాట్లాడినా నీ ధ్యాసంతా, నీ అక్కరంతా నా చదువు గురించే, మార్కుల గురించే.

నా గురించి ఎప్పుడైనా పది నిమిషాలు తీరిగ్గా, ఓపిగ్గా మనసుతో ఆలోచించకూడదా అమ్మా...

ఎట్లా చదువుతున్నావ్?

ఎన్ని గంటలకి లేస్తున్నావ్?

ఎన్ని గంటలకి నిద్రపోతున్నావ్?

ఇంప్రూవ్‌మెంట్ వుందా లేదా?

ప్రోగ్రెస్ ఏమిటి. సిలబస్ ఎంతవరకూ అయ్యింది?

స్లిప్ టెస్ట్‌లో మార్కులెన్ని.

అసైన్‌మెంట్స్‌లో ఎన్ని మార్కులొచ్చాయి?

యూనిట్ టెస్ట్లు ఎట్లా రాసావ్?

స్టడీ హవర్స్ ఎట్లా వున్నాయి? ఓరల్ టెస్ట్‌లో మార్కులెన్ని వస్తున్నాయి?

ఏ సబ్జెక్టులో ఎవరు ఫస్ట్? నీకు సబ్జెక్ట్ వారీగా ర్యాంకింగ్ ఎంత?

అమ్మా.... ఇట్లాంటి వంద ప్రశ్నలు, వెయ్యి ప్రశ్నలు గుర్తుంచుకుని మరీ ప్రతీసారీ అడుగుతావు కదమ్మా.

ఏరా బావున్నావా?

ఏరా తిండి సగిస్తోందా.

ఏరా ఏం కావాలి? అని అడగవెందుకమ్మా?

ఎందుకమ్మా... నీకు ముఖ్యమని, అవసరమని అనిపించిన అన్ని ప్రశ్నల్ని అడిగే నువ్వు – నాకు సంబంధించిన ముఖ్యమైన ఈ మూడు ప్రశ్నల్ని కావాలని అడక్కుండానే గొంతులోనే దాచేసుకుంటావు? నాన్న కళ్ళల్లో హాస్టలు కొచ్చిన ప్రతిసారీ ఏదో నిస్సహాయత నాకు కనపడుతూనే వుందమ్మా. నాన్న ఏమిటో అడగాలనుకుంటాడు. ఇంకేమిటో చెప్పాలనుకుంటాడు.

నాన్న మెత్తగా మాట్లాడితే – ఎక్కడ నేను హాస్టలు వద్దు నాన్నా ఇంటికొచ్చేస్తాను అని అంటానో అని నాన్న కన్నా నీకే ఎక్కువ భయమని, అందుకనే నాన్నను హెచ్చరించావని నాకు తెలుసమ్మా.

అయినా.... అమ్మా... నువ్వు చెప్పేదంతా నోరు తెరవకుండా, అడ్డు రాకుండా నేను వింటున్నప్పుడు – కనీసం 'ఏంట్రా నువ్వేం మాట్లాడవు' అని ఒక్కసారి కూడా నన్ను అడగవేమిటమ్మా?

నువ్వు కాస్త ప్రేమగా, అనునయంగా మాట్లాడితే ఎక్కడ నేనుహాస్టలు బాధలు చెపుతానో అనే భయం కదూ నీది? ఎప్పుడైనా నేను నిన్న బాధపెట్టానా అమ్మా?.... లేదే!

నువ్వేం చేస్తావో, చెయ్యవో కానీ... అమ్మా... అసలు హాస్టల్లో ఏం జరుగుతోందో? నేనెన్ని బాధలు పడుతున్నానో, ఎంతగా భయపడి పోతున్నానో... నీకూ, నాన్నకూ కాకపోతే ఇంకెవరికి చెప్పుకోవాలమ్మా.... నాకు ఇంకెవరున్నారమ్మా?

అమ్మా... ఆకలేస్తుందే... అన్నం కావాలమ్మా...

నిజంగా ఆకలేస్తుందే... సాయంత్రం సరిగ్గా తినలేదు.

హాస్టల్లో తిండి అస్సలు బావుండదంటే... నువ్వు ఒప్పుకోవు. నాన్నను ఒప్పుకోనివ్వవు. బిస్కెట్స్ కూడా లేవమ్మా. ఎట్లా?... అమ్మా.... కొంచెం అన్నం పెట్టవా.... ఆకలేస్తుందే.

***డిసెంబర్ 2***

సాయంత్రం నాన్నకు ఫోన్ చేసాను. ''ఒకసారి తిరుపతికి వచ్చి వెళ్లండి నాన్నా. హాస్టల్ వద్దకు వద్దు. కాలేజి వద్దకి రా రాన్నా'' అంటే – నాన్న కంగారు పడిపోయాడు.

''ఏంట్రా... బంగారూ... ఏమైంది?'' అని నాన్న కంగారుగా భయం భయంగా అడుగుతూ ఉంటే లోలోపలే సంతోషం కలిగింది. ''ఫోన్‌లో చెప్పలేను కాబట్టే నిన్ను రమ్మంటున్నా నాన్నా'' అనే సరికి నాన్న టెన్షన్ పడిపోయాడు.

ఆయన బాధ ఫోన్‌లో తెలుస్తూనే ఉంది. నా గురించి ఆయన బాధ పడుతున్నందుకు నాకూ బాధగానే ఉంది కానీ... నా కోసం. ఒకరున్నారనే భావన, నా ఏడుపు గురించి ఆదుర్దా పడే మనిషి ఒకరుండారనే ధైర్యం నాకు ఎంతో ఊరటని కలిగించింది.

ఎంతోసేపు ఆ సంతోషం, ధైర్యం నిలబడలేదు. నాన్న ఇంట్లో నా ఫోన్ విషయం చెప్పినట్లున్నాడు. వెంటనే అమ్మ. నాకు ఫోన్ చెయ్యకుండా పోయి పోయి ఆ ముదనష్టపు వార్డెన్‌కు ఫోన్ చేసింది.

''ఏమిటండి హాస్టల్లో ఏమిటి సమస్య? మా పాప ఇంటికి ఫోన్ చేసింది. మీరుండేది దేనికి? వార్డెన్‌గా అన్నీ మీరే కదా చూసుకోవాల్సింది'' అని అమ్మ



దబాయించిందట ఫోన్‌లో.

వార్డెన్ ఉగ్రరూపం చూడాలింకా! నా పని అంతే! ఏం తల నొప్పిరా స్వామీ?

### డిసెంబర్ 3

కాలేజీలో లెక్చరర్స్ మాటలు భరించలేక జ్యోత్స్న రోజంతా ఏడుస్తూనే ఉంది. ఫిజిక్స్ లెక్చరర్‌ను చూస్తే అందరికి ఒళ్లంతా కంపరంగా అనిపిస్తుంది. వాడూ... వాడి మిడిగుడ్లు! వెధవ చేష్టలు, భుజంపైన చెయ్యేసి మాట్లాడతాడు. అదొక జబ్బు ముండా.... కొడుక్కి.

మాట్లాడితే నువ్వెంత బరువున్నావ్? అనడుగుతాడు. ఆడపిల్లల బరువుల్తో వెధవకేం పనో? నిలదీసి అడిగేయాలనిపిస్తుంది.

ఎవరికి చెప్పాలో తెలియదు.

అన్నీ పైకి చెప్పలేను. ఫోన్‌లో చెప్పలేనివి చాలానే ఉన్నాయి.

పైకి చెప్పలేనివి, డైరీలో రాసుకోలేనివీ చాలా ఉన్నాయి. మనం ఏ మారితే ఈ డైరీని కూడా చదివేస్తారమ్మా తెలుసా?

అమ్మ వారానికోసారైన హాస్టల్‌కు వస్తే ఎంత బావుంటుంది! ఎంత ధైర్యంగా ఉంటుంది. అమ్మ వచ్చినా ఫ్రీగా ఉండదు. తను చెప్పదలచుకుంది పాఠం అప్పచెప్పినట్లు చెప్పేస్తుంది. తనను అడగాలనుకున్న ప్రశ్నల్ని చకచకా అదే ముఖ్యమైన పనన్నట్లు అడిగేస్తుంది. అంతే తప్ప నేనేం చెప్పాలనుకుంటున్నానో... దాన్ని చెప్పనివ్వదు. గొంతు, గుండె విప్పనివ్వదు.

ఏమిటో ఆమె భయం? వేలకు వేలు ఫీజు కట్టాం – అంటుంది. కాంపిటీషన్ ఎక్కువుందిరా అంటుంది. బాగా చదవాలి. చదువొక్కటే ముఖ్యం. అంటుంది.

నాన్న వస్తే బావుంటుంది. నాన్నలో కూడా ఇదివరకూ లేని భయం. ఆందోళన, టెన్షన్ ఈ మధ్య ఎక్కువగా కనిపిస్తున్నాయి.

నాన్నా... నువ్వయినా నన్ను అర్థం చేసుకోలేవా?... ఒక్కసారి ఇంటికి రావాలనుంది నాన్నా!... ఇంటికి వచ్చి ఒక్కరోజైనా హాయిగా, స్వేచ్ఛగా మన ఇంట్లో, వీధిలో, ఊర్లో అట్లా నడవాలనుంది నాన్నా. తమ్ముడితో పోట్లాడాలనుంది. నా సైకిల్ ఎట్లా వుంది నాన్నా. నన్ను ఇక్కడ హాస్టల్లో పడేసినట్లు దాన్నిఇంట్లో ఓ మూల పడేసింటారు కదూ!

ఒక్కసారి ఇంటికి రావాలనుంది నాన్నా. చాలా మాట్లాడాలని వుంది. ఇంట్లో అన్నం తినాలని వుంది నాన్నా... ప్లీజ్.... బైక్‌లో నీ వెనుక కూర్చొని ఒక్క రౌండ్ అలా వెళ్లాలనుంది నాన్నా...

దేవుడా... నా ఈ చిన్నకోర్కె తీర్చుస్వామీ... ఏడుకొండలవాడా? నా కోర్కె తీర్చు స్వామీ...

### డిసెంబర్ 7

ఛీ... ఛీ... ఇదేం కాలేజీ? వేలకు వేలు ఫీజు. ఇంటర్నేషనల్ స్టాండర్డ్ అంటారు.

రేపు అవ్వాల్సింది... కాలేజీలో ఉన్నట్లుండి... ఈ రోజు మధ్యాహ్నమే.

కాలేజీలో నాప్‌కిన్స్ లేవంట! అమ్మాయిలున్న కాలేజీలో అత్యవసరానికి నాప్‌కిన్స్ వుంచాలనే ఇంగిత జ్ఞానం కూడా లేని వాళ్లంతా కాలేజీలు పెట్టేయడమే.

పైగా... "ముందుగా చూసుకోవాలమ్మాయ్. జాగ్రత్తగా, చురుగ్గా వుండాలని" హితబోధ ఒకటి అనవసరంగా. హాస్టల్లో నాప్‌కిన్స్ కూడా దొంగలించబడతాయనే సంగతి ఎవరికి చెప్పుకోవాలి నేను?

అయినా ఇట్లా జరగడం వల్ల ఈ రోజు కాలేజీలో నేను అనుభవించిన టెన్షన్...

పర్మిషన్ అడిగి బయటకు వెళ్లలేను.

మంగమ్మ సెలవు. ఇంకో అటెండరు ఇరవయ్యేళ్ల కుర్రాడు. వాడికి కాగితం పైన రాసిచ్చి, డబ్బులిచ్చి మెడికల్ స్టోర్‌కి వెళ్లి రమ్మంటే వాడు నా వైపు చూసిన చూపును జన్మలో మరచిపోలేను.

అయినా... ఛ... ఛ... అమ్మాయిలుంటారని, వాళ్ళకోసం కనీసం ఇద్దరు ఆడవాళ్లయినా అటెండర్స్‌గా నియమించకూడదూ? హాస్టల్‌కు వెళ్లి రావాలంటే దూరం ఒకటి. ఏదైనా ఇట్లాంటివి జరిగినపుడు చాలా అవమానంగా అనిపిస్తుంది. తల కొట్టేసినట్లయ్యిందీ రోజు.

కాలేజీలో కనీసం ఇలాంటి సౌకర్యాలు లేకపోయినా, ఎన్నో అసౌకర్యాలు వున్నా ఇట్లాంటి కాలేజీలకు డబ్బులిస్తే చాలు బోలెడంత ప్రచారం వచ్చేస్తుంది.

### డిసెంబర్ 9

ఫిజిక్స్ లెక్చరర్ – "నిన్న ఎందుకు రాలేదు? ఏమైంది? హెల్త్ ప్రాబ్లమా ఏమైనా? మొన్న సాయంత్రం కూడా క్లాస్‌కు రాకుండా బయటే వుండి పోయావ్. ఏమైంది? ఏం జరిగింది? ఏమైనా హెల్ప్‌కావాలా?" అని ప్రత్యేకంగా పిలిపించి క్లాసు బయట అడుగుతుంటే... వాడి చూపులకు భయం కలిగింది. భుజం పైన చెయ్యివేసి నొక్కుతుంటే... ఆ చెయ్యిని నరికేయాలనిపించింది. అయినా ఎంత ధైర్యం వాడికి?

"ఏమైనా కావాలంటే అడుగు. మొహమాట పడకు. తెచ్చిస్తాను..."

స్కౌండ్రల్... వాడసలు లెక్చరర్‌గా కాదు కదా కనీసం మనిషిగా కూడా పనికిరాడు. కల్చర్ లెస్ బ్రూట్.

మొన్న రాధిక ఒకటే ఏడుపు వాడి బాధ పడలేక. "అనుష్కాలా వున్నావ్. యోగా నేర్పిస్తావా" అనడిగాడట. వెధవ. ఆడపిల్లల హాస్టల్లో మగ పురుగులే లేకుండా వుంటే ఎంత బావుంటుందో.

రూం క్లీన్ చేయడానికి రంగమ్మా, ఆమె మొగుడు ఇద్దరూ వచ్చినప్పుడు, కింద వార్డెన్ పిలిస్తే రంగమ్మ మెట్లు దిగి అటు వెళ్ళగానే ఆమె మొగుడు చేసిన పని... అయ్యయ్యో. ఉమ ఎంత ఏడ్చిందో... ఆ లం. కొడుకు చేసిన పనికి. విషయం వార్డన్ దాకా వెళ్ళేదే. కానీ వూరికే అగుడవడం, అనవసరమైన ప్రచారం. మిగతా పిల్లలు అదేదో వింత జంతువుని చూస్తున్నట్లు మొహాలు పెడతారు. అదొక పెద్ద బాధ. అందుకే భయపడి ఉమ నోరు అదుపు చేసుకుంది.

దేవుడా ఏమిటి మాకీ శిక్ష? ఏం తప్పు చేసామని మాకిన్ని అవమానాలు, శిక్షలు. నోరు తెరిచి ఇదీ అని చెప్పలేని సమస్యలెన్నో.

అమ్మా – మొగవాళ్ళతోనే కాదమ్మా – ఆడపిల్లలే అయినా కొంతమంది వెకిలిచేష్టలు భరించలేనమ్మా. నాన్నకు కూడా చెప్పలేనివి కొన్ని. అమ్మా... నీకైనా చెప్పుకోలేనివి కొన్ని.

తిండి బావుందని చెప్పాలి. హాస్టల్ బావుందని చెప్పాలి. కాలేజీ బావుందని చెప్పాలి. పాఠాలు అర్థమవుతున్నాయని చెప్పాలి. అంతా బావుందనే చెప్పాలి. తప్పదు. మీ తృప్తికోసం.

అమ్మా... నాన్నా... మీరెప్పుడడిగినా బావున్నానని చెప్పాలి. సంతోషంగా వున్నానని చెప్పాలి. అంతా ఓకే అని చెప్పాలి.

లేదంటే మీ కళ్ళల్లో, మొహంలో భయాన్ని, బాధని, అసహనాన్ని, కోపాన్ని విసుగుని, విరక్తిని... చూడాల్సి వుంటుంది. తిట్లు తినాల్సి వస్తుంది.

ఒద్దొద్దు... ఏదేమైనా... మీకు మార్కులు కావాలి. ఏ పరీక్షలో ఎన్ని మార్కులొచ్చాయన్నదే.... మీకు ముఖ్యం... చదువు... చదువు...

మ్మా... ఒక్కరోజైనా ఇంటికి వచ్చి మనసారా మీతో మాట్లాడి కడుపారా తిని, ప్రశాంతంగా ఒక రాత్రయినా నిద్రపోవాలని వుందమ్మా! ప్లీజ్... మ్మా... నాన్నా – నువ్వయినా అమ్మకు చెప్పవూ.. ప్లీజ్ ... నాన్నా... దేవుడా...

*

## అమ్మాయి నిశ్శబ్దపు వేదన



జీవితం రుచి తెలుసుకోవాలంటే మనసుతో గ్రహించాల్సినవి, తరచి ఆలోచించుకోవాల్సినవి చాలానే.. జీవితంలో మిస్సవుతున్న సత్యం. ఒక్కోసారి జీవితాన్నే మిస్సవుతున్న దుఃఖం. మనుషులు, మనసులు, మాటల మధ్య పెరిగే దూరాలు ఒక వైపు. అవ్యాజమైన ప్రేమ మాత్రమే తెలిసిన పసిపాప చదువుల పందెంలో అమ్మను, నాన్నను గెలిపించటానికి అదిమి పట్టుకున్న తన నిశ్శబ్దపు వేదనే ఈ 'ప్రార్థన'. ఎప్పుడూ ప్రోత్సహించే నవ్యకు వినమ్రంగా నమస్సులు.

**– పలమనేరు బాలాజి**

**6-219, గుడియాత్తం రోడ్డు,**
**పలమనేరు-517408**
**సెల్: 94409 95010**